విశాలాంధ్ర కృష్ణా జిల్లా

సీఆర్... మీకు జోహార్

ఘనంగా చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి

విశాలాంధ్ర-చల్లపల్లి: దున్నేవాడికే భూమి దక్కాలన్న నినాదంతో ఉద్యమాన్ని ప్రారంభించి అనేక మంది పేద ప్రజలకు భూమి పంపిణీ చేసిన భూ పోరాట యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి స్థానిక సీఆర్ కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ధనిక, సంపన్న వర్గంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు నిత్యం పేదల పక్షాన పోరాటాలు చేసి, దున్నేవాడికే భూమి దక్కాలన్న నినాదంతో అనేక మంది పేద ప్రజలకు భూములు పంచిన ఘనత ఆయనదన్నారు. దివి ఏరియా ప్రాంతంలో జమిందారీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పేదల పక్షాన నిలబడి పోరాటం చేశారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతమైన మంగళాపురంలో జన్మించిన ఆయన కమ్యూనిస్టు పార్టీలో జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగి అనేక సంస్కరణలు తీసుకు వచ్చారని గుర్తు చేసుకున్నారు. దివి ఏరియా ఖ్యాతిని ప్రపంచం నలుమూలలా గుర్తింపు తీసుకు వచ్చారని పేర్కొన్నారు. చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో వేల ఎకరాల భూములు పేదలకు పంచిన ఘనత చంద్రదేనన్నారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు జ్ఞాపకార్థం చల్లపల్లిలో శ్రీ చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం నిర్మించి అందులో ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల పక్షాన, రైతుల పక్షాన జరిగే అనేక ఉద్యమాలు వికాస్ కేంద్రం నుండే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. స్థానిక బీసీ నాయకులు మోర్ల ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన రాజేశ్వరరావు జీవితాంశాలను పుస్తక రూపంలో ప్రచురించి నేటి తరం యువతకు అందజేస్తే యువత స్ఫూర్తి పొందుతారని సూచన చేయడంతో పార్టీ నాయకులు ఆ దిశగా ఆలోచన చేస్తామని హామీ ఇచ్చారు. నేటితరం కమ్యూనిస్టు పార్టీ నాయకులు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తొలుత పార్టీ నాయకులు చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. సీఆర్ ట్రస్ట్ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమాను సురేంద్రనాథ్ బెనర్జీ, నియోజకవర్గం కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు కొర్రపాటి ముఖర్జీ, మల్లు పెద్ది బోసు, మాలెంపాటి కోటేశ్వరరావు, డొక్కు శ్రీనివాసరావు, అల్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ నాయకులు లంక నాగమల్లి, సిద్ధ బత్తుల వాసు, బీసీ నాయకులు మోర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం: చంద్రా రాజేశ్వరరావు సేవలు మనందరం గుర్తుంచుకోవాలని, ఆయన భావాలతో ముందుకు సాగాలని సీపీఐ నాయకురాలు దేవా భక్తుని నిర్మల అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ అధ్యక్షతన రాజేశ్వరరావు 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఓ దుగు చైతన్య కుమార్, సీపీఐ నాయకులు మోదుమూడి నాగరాజు, తురక లక్ష్మణరావు, భారతమ్మ, లక్ష్మి, రాఘవమ్మ, జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు, భూ పోరాట యోధుడు కామ్రేడ్ సెంటర్ రాజేశ్వరరావు 29వ వర్ధంతి వేడుకలు పెదపూడిలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కూచిపూడి-పెదపూడి సెంటర్లోని చలసాని కాంచనరావు సీపీఐ కార్యాలయంలో మొవ్వ మండల సీపీఐ శాఖ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికీ ముఖ్యఅతిథిగా పామర్రు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి దగాని సంగీతరావు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా ప్రజానాట్యమండలి కన్వీనర్ కోసూరువెంకట అప్పారావు, మొవ్వమండల సిపిఐ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, కూచిపూడి శాఖ కార్యదర్శి కొండా నాగేశ్వరరావు, కోసూరు శాఖ సభ్యుడు పెదపూడి వెంకటేశ్వరరావు లు పాల్గొని నివాళులర్పించారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-మచిలీపట్నం: తుమ్మల చెరువు, తుమ్మలపాలెం గ్రామ రహదారి కూడలిలో స్థానిక జనసేన నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం బండి రామకృష్ణ చేతుల మీదగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని మండల, నగర పరిధిలో పలుకూడళ్ళలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని పాదచారులకు, వాహనదారులకు వేసవి దాహార్తి తీర్చుట కొరకు మజ్జిగ, మంచినీరు, శీతలపానీయాలు మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయబోయే చలివేంద్రాలలో పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు,నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని నరేష్, జిల్లా నాయకులు జన్నునాగరాజు, ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ నాంచారయ్య, బావిరెడ్డిమురళి,మత్తిరాము, కర్ర గాంధీ, కూనపురెడ్డి ప్రసాద్, అర్జారామకృష్ణ, రామ్ జ్యోతి మండల పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా ఇస్తున్నది సీఎం జగనే

విశాలాంధ్ర-గుడివాడ: దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత విద్య, వైద్యం ప్రతి పేదవాడికి ఉచితంగా అందుతున్నా యని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆదివారం స్థానిక గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వృద్ధుల విభాగం వార్డును, నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్టును మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావుతో కలసి ప్రారంభించారు. పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, ఏరియా అసుపత్రి అభివృద్ధి కమిటి చైర్మన్ ఎం.వి నారాయణరెడ్డి, అసుపత్రి సూపరెంటెంట్ ఇందిరాదేవి, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, నేతలు మండలి హనుమంతరావు, పాలేటి చంటి పాల్గొన్నారు.

వచన కవితకు ఆధునికతను అద్దిన అద్దేపల్లి

విశాలాంధ్ర-గుడివాడ: వచన కవితకు ఆధునికతను అద్దిన సాహితీ వేత్త అద్దేపల్లి రామమోహన్‌రావు చిరస్మరణీయుడని పట్టణ సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి జి.మాల్యాద్రి కొనియాడారు. శనివారం రాత్రి సుందరయ్య భవన్‌లో సుప్రసిద్ధ కవి సాహితీ విమర్శకులు డా॥అద్దేపల్లి రామమోహనరావు సంస్మరణ సభను నిర్వహించారు. కవి, రచయిత వసుధ బసవేశ్వరరావు, మాల్యాద్రి, సభ్యులు లంకా సురేంద్ర, వంగిపురపు వీరరాఘవాచారి, కృష్ణకిషోర్, నవీన్‌కుమార్, అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రహదారులు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలో 'సన్‌డే ఉదయం వేళలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. వేకువజామున మంచుతో చల్లగా ఉన్న వాతావరణం 8 గంటల నుంచి ఉష్ణోగ్రతలు ప్రారంభమైనాయి. అవి క్రమేణా పెరుగుతూ ఉదయం 11 గంటలకు ఉష్ణోగ్రత వాతావరణం నమోదైంది. దీనితో ప్రజలు జనజీవన స్రవంతిలోకి రాలేక ఇంటి వద్దనే ఫ్యాన్లు, ఏసీల నడుమ చల్లటి వాతావరణంలో గడిపారు. దీంతో బజారులన్నీ బోసిపోవడం కాకుండా వ్యాపారాలు సైతం మందుకొడిగా సాగాయి. ఏప్రిల్‌లోనే ఈ విధంగా ఉంటే మే నెలలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత నిదానంగా బయటికి రావడం ప్రారంభించారు.

పెదపూడిలో జగనన్న నువ్వే మా నమ్మకం

విశాలాంధ్ర-కూచిపూడి: నువ్వు మం దలం పెదపూడి గ్రామంలో ఆదివారం 'మా నమ్మకం మీరే జగనన్న' కార్యక్రమాన్ని గృహసారథులు నిర్వహించారు. వారి ఇంటింటికి తిరిగి దీనికి సంబంధించిన సమాచారాన్ని అర్థం చేస్తూ జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అంటించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు సిద్ధు, నాగరాజులతో పాటు వలంటీర్లు కూడా పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వమండలం భట్లపెనుమర్రులోని డొంకలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై కూచిపూడి పోలీసులు ఆదివారం దాడి చేశారు. కూచిపూడి ఎస్ఐ డీ సందీప్ తెలిపిన వివరాలు ప్రకారం రహస్య సమాచారంతో సిబ్బందితో కలసిదాడి చేశామని పేర్కొన్నారు. పదిమంది వ్యక్తులు, రెండు కోడి పుంజులు, రూ.20,440 నగదు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామని వివరించారు.

నేటికీ విడుదల కాని రిటైర్ ఆయాల బకాయిలు

విశాలాంధ్ర-పెడన: పెడన మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన శానిటేషన్ ఆయాల బకాయిలు ఇప్పించాలని అధికారులను రిటైర్ ప్రభుత్వ పాఠశాలల ఆయాలు విజ్ఞప్తి చేశారు. ఇటీవల మండలంలో అచ్చయ్య వారిపాలెంలో జరిగిన గ్రామదర్శినిలో శానిటేషన్ ఆయాల బకాయిలపై అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో 2017-18లో డీఆర్‌డీఏ వెలుగు ఆఫీస్, మండల విద్యాశాఖాధికారి ఉత్తర్వుల మేరకు శానిటేషన్ ఆయాలుగా నియామకం చేశారు. మండలంలో కొన్ని స్కూళ్లల్లో ఆయాలకు 60 ఏళ్లు నిండాయని అకారణంగా కొంతమంది ఆయాలను తొలగించారు. వీరి బకాయిలు సుమారు రూ.20 లక్షల పైబడి ఉంటుందని అంచనా. ప్రభుత్వ నిబంధనలను ఏమైనప్పటికీ వారిని తొలగించడం చాలా అన్యాయం. ఒక్కొక్క స్కూల్లో రూ.60 వేల నుంచి 80 వేల వరకూ బకాయిలు ఉన్నాయి. పెండింగ్ బకాయిలు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

హనుమంతపురంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న'

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు సరిగా చేరుతున్నవా లేదా అని హనుమంతపురంలో గడప గడపకు వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ ఆధ్వర్యంలో తిరుగుతూ 'మా నమ్మకం నువ్వే జగనన్న' నిర్వహించారు. గత ప్రభుత్వం కంటే వైసీపీ ప్రభుత్వం చేసింది వివరిస్తూ ఇంటికి స్టిక్కర్లు అంటిస్తున్నారు. సర్పంచ్ కలపాల రాంబాబు, గృహసారథులు కే సుబ్రమణ్యం, ఇ.నాగేశ్వరరావు, శొంఠి మల్లేశ్వరరావు కొడాలి నాగమణి, పి.శ్రీనివాసరావు, చింతా సురేష్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పాలన అధ్వాన్నం

విశాలాంధ్ర-పమిడిముక్కల: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన అధ్వాన్నంగా తయారైందని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార రాజా అన్నారు. గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో అనేక రకాల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. వీరంకిలాకు-కృష్ణాపురం ఆర్ అండ్ బి రహదారి నిర్మాణంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పని వదిలి సామగ్రితో వెళ్లిపోయాడని, జిల్లాలో అనేకచోట్ల రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఈ రహదారులు వల్ల దుమ్ము ధూళితో ప్రజల ఆరోగ్యాలతో చలగాటమాడుతున్నారని, వాహన ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు.

ముగ్గురికి 'హీరోస్ ఆఫ్ ది స్కూల్ ఎడ్యుకేషన్' కితాబు

విశాలాంధ్ర-కూచిపూడి: కృష్ణాజిల్లామొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, లెక్కల టీచర్, గ్రంథాలయ అసిస్టెంట్లకు 'హీరోస్ ఆఫ్ ది స్కూల్ ఎడ్యుకేషన్' అంటూ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కితాబు ఇచ్చారని ప్రధానోపాధ్యాయులు ఎన్. వెంకట శ్రీధర్ ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పాఠశాల తరగతుల నిర్వహిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయులును, జాతీయస్థాయిలో లెక్కలు అంశంపై పలు ఎగ్జిబిషన్ లో పాల్గొని ఈ పాఠశాలను జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చినలెక్కల టీచర్ మేకా రాణిని, జగనన్నగోరు ముద్ద నిర్వహణలో ఇన్చార్జిగా కొనసాగుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించడానికి తన వంతు కృషి జరుపుతున్న పాఠశాల గ్రంథాలయ అసిస్టెంట్ జె.శ్యామ్ కుమార్ ను అభినందిస్తూ ప్రశంసా పత్రాలను వాట్సాప్లో శనివారం పోస్ట్ చేశారని ఆయన వివరించారు. కృష్ణాజిల్లాలో ఒకే పాఠశాలలో ముగ్గురుని అభినందించటంపై అరుదైన సంఘటనగా ఆయన అభివర్ణిస్తూ ఇది తమకు ఆనందంగా ఉందని, దీనిని సువర్ణాక్షరాలతో లిఖించుకొని తమ గుండెల్లో భద్రపరచుకుంటామని పేర్కొన్నారు. ఇదేవిధంగా జిల్లాలో నాగాయలంక మండలంలోని సొర్లగంది పాఠశాలలోని టీచర్ టి జ్యోతి కూడా లభించిందని ఆయన వివరించారు. ఈస్ట్ గోదావరి జిల్లాలో ఒకరికి, శ్రీ సత్యసాయి జిల్లాలో ఒకరికి, పల్నాడు జిల్లాలో ఏడుగురికి"హీరోస్.ఆఫ్ ది స్కూల్ ఎడ్యుకేషన్"కితాబులు లభించాయి. ప్రవీణ్ ప్రకాష్ ఈనెల 1వ తారీకు శనివారం మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జాయింట్ కలెక్టర్, ఆర్ జె డి, డీఈవో లతో కలిసి పరిశీలించిన అనంతరం ఆ ముగ్గురు ఫోటోలతో కూడిన ప్రశంస పత్రాన్ని వాట్సాప్ లో పోస్ట్ చేయటం విశేషం.

చంద్రబాబు పర్యటన జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: టీడీపీ జాతీయ పార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి వర్ల కుమార రాజా పార్టీ సమావేశం జరిగింది. ఆదివారం వీరంకిలాకులో జరిగిన పార్టీ సమావేశంలో వర్ల మాట్లాడుతూ పార్టీ నాయకుడు చంద్రబాబు నాయుడు మచిలీపట్నం పామర్రు గుడివాడలలో జరిగే సభలకు దిశ నిర్దేశాలు చేశారు. కార్యకర్తలు అభిమానులు తమదైన శైలిలో పాల్గొనాలని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు నాయకులు మోటూరు వెంకటసుబ్బయ్య లింగమనేని బాబురావు లింగంనేని బాబురావు మైనేని నరేంద్ర కుమ్మరి రామారావు మీర్జా అలీ పలువురు తెదేపా నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఎక్కడి మురుగు అక్కడే

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): కృష్ణలంక 22వ డివిజన్‌లో పారిశుధ్య నిర్వాహణ పడకేసింది. ఫలితంగా డివిజన్‌లో ప్రజలు బయటకు వస్తే దుర్వాసనతో, చీకటి పడితే దోమల దాడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్‌లో క్రమం తప్పకుండా డ్రెయిన్లు క్లీన్ చేయకపోవటం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక శానిటేషన్ ఇనస్పెక్టర్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా తమ సొంత పనులు చేసుకుంటుండటంతో డివిజన్‌లో మురుగు కాలువలు అధ్వాన్నంగా తయారయ్యాయని డివిజన్ వాసులు చెబుతున్నారు. సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు మూడు, నాలుగు రోజులకు ఒకసారి వచ్చి పోతుంటారని, సమస్య మాత్రం పరిష్కారం కాదని ఆరోపిస్తున్నారు. ఏ అధికారైనా డివిజన్‌లోకి వచ్చి కళ్ళు పెద్దివి చేసి చూస్తే సమస్య తెలుస్తుందని, డ్రెయిన్లు పొంగి ముగురు నీరు రోడ్లుపైకి వచ్చి ఎండిపోతుందేకాని క్లీనింగ్ మాత్రం జరగటంలేదని, డివిజన్‌లో ఏ రోడ్డులో చూసినా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా డివిజన్‌లో మురుగు కాలువలు ప్రతి రోజు శుభ్రం చేయాలని కోరుతున్నారు.

నాలుగైదు రోజులకొకసారి డ్రెయిన్ల క్లీనింగ్

డివిజన్‌లో భ్రమరాంబపురం, అన్నమ్మ పేరంటాలు గుడి రోడ్డు, గంగానమ్మ గుడి రోడ్డు, మలేరియా ఆసుపత్రి రోడ్డు, పుల్లల అడితీల రోడ్డు తదితర ప్రాంతాలో సైడ్ డ్రెయిన్ల క్లీనింగ్ సక్రమంగా జరగటంలేదని, నాలుగైదు రోజులకు ఒకసారి డ్రెయిన్లు క్లీనింగ్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీని వల్ల డ్రెయిన్లలో మురుగునీరు పొంగి పొర్లి రోడ్లుపైకి వచ్చి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల అవాసాలుగా మారాయని డివిజన్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లో గతంలో సైడ్ డ్రెయిన్లు క్లీనింగ్‌కు మగ కార్మికులు వచ్చే క్లీన్ చేసేవారని, కాని కొన్ని రోజుల నుంచి మహిళా కార్మికులు నాలుగైదు రోజులకు ఒకసారి వచ్చి సైడ్ డ్రెయిన్లు క్లీన్ చేస్తున్నారని, మురుగు కాలువల్లో మురుగు కలక మురికి కూపాలుగా మారాయని ఆయా ప్రాంతాల్లోని స్థానికులు చెబుతున్నారు. దీంతో కాలువల్లో మురుగునీరు ముందుకు కదలక డ్రెయిన్లు నిండి ఇంటి గుమ్మాల్లోకి వస్తోందని, నిత్యం నరకం అనుభవిస్తున్నామని స్థానిక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 22వ డివిజనన్‌లో పారిశుధ్యం అద్వాన్నంగా మారటంతో పలు ప్రాంతాల్లో దుర్వాసన, దోమల తీవ్రత ప్రజల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని, అపరిశుభ్రత వల్ల చీకటి పడితే దోమలు చెండుకు తింటున్నాయని స్థానికులు తెలిపారు. నిత్యం సైడు కాలువలు మురుగునీటితో నిండి ఉండటం వల్ల ఎండా కాలం అయినా వానా కాలం మాదిరిగా దోమలు దాడిచేసి రక్తాన్ని పీల్చేస్తున్నాయని, కంటిపై కునుకు కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక శానిటేషన్ ఇనస్పెక్టర్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. డివిజన్‌లో నెలకొన్న శానిటేషన్ సమస్యలపై స్థానిక శానిటేషన్ ఇనస్పెక్టర్‌ను విశాలాంధ్ర ప్రతినిది వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందబాటులో లేకపోవటం గమనార్హం.

రమేష్ హాస్పిటల్స్, ఐఎంఏ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో తాజ్ వివాంతా హెటల్ నందు ఈ రోజు వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో రమేష్ హాస్పిటల్స్ గ్రూప్ నందు కల 32 మంది సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు తాము వైద్యం అందించిన అత్యంత క్లిష్టమైన కేసులకు సంబంధించి విజయవంతంగా చికిత్స నిర్వహించిన వాటినిగుంటూరు,విజయవాడ , ఏలూరు ప్రాంతాల నుంచి ప్రత్యక్షంగా హాజరయిన 380 మంది వైద్యులకు , ఆన్ లైన్లో రాష్ట్ర వ్యాప్తంగా హాజరయిన 200 మంది వైద్యులకు ఈ వైద్య విద్యా కార్యక్రమం నందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్.పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ అకస్మాత్తుగా సంభవించే గుండె పోటు మరణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని గుండె పోటు ఆకస్మికంగా అప్పటి కప్పుడు రాదని,కొన్ని సంవత్సరాలకు ముందే దానికి బీజం పడుతుందని,అది క్రమేపీ పెరిగి ఆకస్మికంగా గుండె పోటు సంభవిస్తుందని దానిని ముందుగానే కనుగొనవలసిన బాధ్యత ఫ్యామిలీ డాక్టర్లు మరియు కార్డియాలజిస్టుల పై ఎంతో ఉందని తెలియ చేసారు.సాంప్రదాయ పరీక్షలైన ఈ.సీ.జీ,ఎకో,ట్రెడ్ మిల్ పరీక్షల కంటే అత్యాధునికమైన క్యాల్షియం స్కోర్,సి.టి.కరొనరీ యాంజియోగ్రామ్ పరీక్షా ఫలితాలు గుండె జబ్బు ప్రమాదాన్ని ముందే అంచనా వేస్తున్నాయని వీటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ రమేష్ బాబు తెలియ చేశారు. రమేష్ హాస్పిటల్స్ భాగస్వామ్య సంస్థ ఆస్టర్ డి.ఎం హెల్త్ కేర్ ఇండియా హెడ్ డాక్టర్.నితీష్ షెట్టి,ఆంధ్ర ప్రదేశ్ సీ.ఈ.ఓ దేవానంద్ రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామ్మోహనరావు,మెడికల్ డైరెక్టర్ డాక్టర్.పావులూరి శ్రీనివాసరావు,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రెహమాన్,సెక్రెటరీ డాక్టర్.దుర్గారాణి,మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ సూరపనేని సుధాకర్,ప్రముఖ ఎముకలు,కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ గుడారు జగదీష్, పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర-చల్లపల్లి: భవిష్యత్తు తరాల గురించి ఆలోచన చేసే విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి, యువతకు భవిత చేకూరుతుందని చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, తెలుగుమహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నడకుదురు శివారు రాముడుపాలెం దళితవాడలో ఆదివారం జరిగింది. టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అమలుచేసిన అనేక పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందనీ, ప్రజలు వాస్తవాలను గ్రహించి రానున్న ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర నేతలు జల్లూరి ప్రసాద్, మోర్ల ప్రసాద్, మాజీ సర్పంచ్ మాతంగి వేణు, ఉపసర్పంచ్ మొవ్వ కోటేశ్వరరావు, షేక్ నబీఘోరి, పుండరీకాక్షుడు, రవి, రాజులపాటి జగదీష్, పెద్దిబోయిన హరనాథ్, బడుగు వేణు, మాతంగి గంగాధరరావు, క్లస్టర్ ఇన్చార్జిలు మోర్ల శివ, మల్లంపల్లి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ముసునూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలోనికి 2023-24వ విద్యా సంవత్సరం ప్రవేశం పొందేందుకుగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీదేవి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఏపి గురుకుల విద్యాలయాల సంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ముసునూరు,నిమ్మకూరు,పులిగడ్డ పాఠశాల్లో 5వ తరగతి ప్రవేశానికి ఇంగ్లీషు మీడయంలో చదువుకునేందుకుగాను ప్రస్తుతం 4వతరగతి పూర్తిచేసిన విద్యార్థిని,విద్యార్థులు మీ సేవా కేంద్రాల్లో ,ఇంటర్నెట్ కేంద్రాలలో ఈ రోజు నుండి ఈనెల 24వ తేది లోపల దరఖాస్తు చేయవచ్చున్నారు. బాలికలకు నిమ్మకూరు, ముసునూరు కాగా, బాలురకు పులిగడ్డ, నిమ్మకూరు పాఠశాలలో సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 9866559629 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చునన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర- ముసునూరు: ముసునూరు మండలం చెక్కపల్లిగ్రా మం దళితవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు చెక్కపల్లి గ్రామానికి చెందిన కొయ్యూరి రవికుమార్, కొయ్యూరి బసవపూర్ణ అను ఈ ఇద్దరు మానసిక అంగవైకల్యం కల్గిన అక్కతమ్ముడు వీరు నివాసం వుంటున్న రెండు తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధంకావడంతో కన్నీరు మున్నీరవుతున్న భాదితులు. పారిశ్రామిక వేత,టిడిపి నాయకులు పర్వతనేని గంగధరరావు వీరు కుటంబ సభ్యలకు తమ వంతు సహాయంగా రూ.పదివేలు ఆర్థిక సహాయం అందచేశారు. అక్కినేని చందు,తోట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్

విశాలాంధ్ర చాట్రాయి:నిరుపేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని చాట్రాయి ఎంపీపీ లంకొ నిర్మలా కొని ఆడారు. ఆదివారం చాట్రాయి మండలం బూరుగూడెం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విశాలాంధ్ర ఎన్‌టీఆర్ జిల్లా

చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో పార్టీ బలోపేతం

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు ఉద్యమ స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి పునరంకితం అవుదామని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు అన్నారు. పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి పోలీస్ కంట్రోల్ రూం ఎదురుగా ఉన్న చంద్ర రాజేశ్వరరావు విగ్రహం వద్ద ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ భూ పోరాట యోధులు చంద్ర రాజేశ్వరరావు 29 వ వర్ధంతిని దేశవ్యాప్తంగా కమ్యునిస్టు శ్రేణులు ఘనంగా జరుపుకుంటున్నారని తెలిపారు. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం దేశంలో సాగిన భూ పోరాటాలకు చంద్ర రాజేశ్వరరావు ఆజ్యాం పోశారని, తన భూమిని పేదలకు పంపిణీ చేసిన త్యాగశీలని కొనియాడారు. కృష్ణాజిల్లా చల్లపల్లి జమిందర్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి వందలాది ఏకరాల భూమిని పేదలకు పంపిణీ చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. యువకులను పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేవారన్నారు. దేశంలో బీజేపీ మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలు పెరిగి, కార్పొరేట్లకు అనుకూల చట్టాలు తెచ్చిన నేపథ్యంలో కమ్యునిస్టు శ్రేణులు అందరూ చంద్ర రాజేశ్వరరావు ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ముందుగా చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు డీవీ రమణబాబు, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య, కొడాలి ఆనందరావు, దోనేపూడి సూరిబాబు, కంచర్ల నాగేశ్వరరావు, ఎస్వి రమణ, కాళ్ళ చిన్నప్ప, నత్తల లక్ష్మీనారాయణ, జి. జనార్ధన్, బెవర శ్రీనివాసరావు, తమ్మిన దుర్గా, చీకటి సైదారావు, మీగడ కరుణాకర్, ఏఐఎస్ఎఫ్ సాయి కుమార్, కాలే వెంకటేశ్వరరావు, మురిగేశన్ రాము, కే ఆర్ ఆంజనేయులు, సింగరాజు సాంబశివరావు, నాగార్జున యూనిర్సిటీ పూర్వ ఆచార్యులు సి నరసింహారావు, డాక్టర్ రాంప్రసాద్, బుడ్డిగ జమిందార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటవ డివిజన్‌లో

చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి 1వ డివిజన్ లెనిన్ నగర్ చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయం వద్ద కొడాలి ఆనందరావు అధ్యక్షతన జరిగింది. చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పున్నం కృష్ణ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు తనకున్న వందలాది ఎకరాలను నిరుపేదలకు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఎందరో నాయకులు పేదవారికి భూములను పంచారని చెప్పారు. విజయవాడలో ఆడపిల్లలపై, మహిళలపై అకృత్యాలు చేసే రౌడీలను తరిమి కొట్టారని, విజయవాడలో రౌడీయిజాన్ని అప్పుడున్న కమ్యూనిస్టు నాయకులతో కలిసి అణిచివేశారని గుర్తు చేశారు. చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో పార్టీ, ప్రజాసంఘాలలో పని చేస్తామని మతోన్మాదాన్ని ఎదిరిస్తామని ఈ వర్ధంతి సభలో నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో దోనేపూడి సూరిబాబు, చీకటి సైదారావు, బెవర శ్రీను, ఎస్.కె అలీ, ఎం సాయి, లంకే సాయి, ఐతరాజు ఆంజనేయులు, ఈపి ప్రసాద్, కే దేవుడు, ఆర్ రమణ, ఈ.అయ్యప్ప, ఎం.రమణ, పి. మోహన్ పాల్గొన్నారు.

తిరువూరు: సుదీర్ఘకాలం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నిస్వార్థ ప్రజానాయకుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ సీనియర్ నాయకులు పసుపులేటి వెంకయ్య, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తూము కృష్ణయ్య అన్నారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో ఆదివారం చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకయ్య, కృష్ణయ్య రాజేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక, శాంతి ఉద్యమాలను నడిపించిన నేత చంద్ర రాజేశ్వరరావు అనేక దేశాల నుంచి అవార్డులు అందుకున్నారని, వివాదాస్పద బాబ్రీ మసీదును మ్యూజియంగా మార్చాలని ప్రతిపాదించిన మానవతావాది రాజేశ్వరరావు అని వారు కొనియాడారు. నిరాడంబరతకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఆయన తాను ఎంత పెద్ద హోదాలో ఉన్నా పార్టీ నాయకులు కార్యకర్తలతో ఎంతో కలివిడిగా మాట్లాడేవారిని తెలిపారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చిన మహోన్నత వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, పార్టీ నగర పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు, సహాయ కార్యదర్శి ఎం ఉదయ్, ఎస్ కే సుబాని, కార్పెంటర్ ఎస్ కే నాగుల్ మీరా, ఆయినాల ముత్తయ్య, బాణాల అశోక్, పల్లపు మురళి తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి స్థానిక సిఆర్ భవన్ లో ఆదివారం రైతు పేటలోని సెంటర్ రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బలుసుపాటి రాంబాబు సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. నందిగామ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు(అంజి), పట్టణ కార్యదర్శి వేముల వీరయ్య, తోట ప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు షేక్ మౌలాలి, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: పేదలకు భూమిని పంచిన కామ్రేడ్ చంద్ర రాజేశ్వరవు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం గన్నవరం సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్, గన్నవరం సీపీఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, పెద్దు వెంకట శివరామ కృష్ణ, కాట్రగడ్డ రామచంద్ర జోషి, బందారు లక్ష్మయ్య, కట్టవరపు విజయరావు, ఎం సాంబయ్య, పెద్దు వెంకట శివరామకృష్ణ, వై నాగరాజు, ఏసుబాబు, యువకులు పాల్గొన్నారు. తొలుత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు చితపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

బాధ్యతలతో కూడిన హక్కులు అందిస్తాం

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): విధులు, బాధ్యతలతో కూడిన హక్కులను ప్రజలకు అందించేందుకు అమ్మ పార్టీ 20 సూత్రాల ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, రానున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో మహిళా అభ్యర్థులనే పోటీచేయిస్తుందని అమ్మ పార్టీ జాతీయ కన్వీనర్ కె.శ్యామలారెడ్డి తెలిపారు.ఆ పార్టీకి చెందిన ప్రతినిధులు ఆదివారం లీలా గ్రాండ్ హోటల్లో సమావేశ నిర్వహించారు.దీనికి రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని,ప్రస్తుత ప్రభుత్వ పాలనపై విసిగిపోయారన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పక్కన పెట్టి పంట దోపిడీ చేసి పరిగ ప్రజలకు పంచినట్లు పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని, అమ్మ పార్టీ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని అన్నారు.మహిళలు రాజకీయ ఉనికిని కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని, జనాభాలో సగ బాగంగా ఉన్న మహిళలకు చట్టసభల్లో 10 శాతం కూడా ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. పార్టీ జాతీయ జనరల్ సెక్రటరీ ఎస్.సుప్రవీణ మాట్లాడుతూ సమాజం,చట్టసభల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. మహిళా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా తమ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లో మహిళా ప్రాతినిధ్యం సక్రమంగా లేదని, చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యం కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా అమ్మ పార్టీ 20 సూత్రాల ప్రణాళిక బ్రోచర్ను నేతలు ఆవిష్కరించారు. జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించి ఎన్నికల కార్యాచరణ ప్రకటించాలని సమావేశంలో తీర్మానిం చారు.ఈ సమావేశంలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బిఎన్ రాజు,రాష్ట్ర డిప్యూటీ కన్వీనర్ పత్తిపాటి దేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మెహరున్నీసా, సలహా సంఘ సభ్యులు బి.హనుమం తరావు, కె.సుజాత, వీరమాచనేని కుమారి,వై.సుభాషిణీ, డాక్టర్ కె. నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో బాహుబలి ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-విజయవాడ(లబ్బీపేట): నగరంలో శాతవాహన కాలేజీ మైదానంలో భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన బాహుబలి ఎగ్జిబిషన్‌ను సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. సినిమాలకే పరిమితమైన సెట్టింగ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమని విష్ణు అన్నారు. అనిత ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో శాతవాహన కాలేజీ ప్రాంగణంలో ఈ బాహుబలి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. నిర్వాహకులు ఎన్ గోపీనాథ్ బాహుబలి సెట్టింగ్ విజయవాడ వాసులను ఎంతగానో అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవి నగరవాసుల కోసం ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని ఎగ్జిబిషన్లోని సెట్టింగులు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఎంతగానో ఆకట్టుకోవడంతోపాటు ఆశ్చర్య చకితులను చేస్తాయని ఆయన పేర్కొన్నారు. బాహుబలి ఎగ్జిబిషన్లో జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆటవస్తువులు ఈ ఎగ్జిబిషన్ లో ప్రత్యేకఆకర్షణగా నిలుస్తూ.. ఇటు చిన్నారులు, అటు పెద్దవారికి ఆహ్లాదంతో పాటూ ఆనందాన్ని పంచుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కలకత్తా, జైపూర్, ఢిల్లీ, మహారాష్ట్ర చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్లో ప్రదర్శించారని పేర్కొన్నారు. వైసీపీ కార్పొరేటర్ కుక్కల అనిత, శాతవాహన కాలేజ్ కరెస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ, నిర్వాహకులు భాను, కిరణ్, అడపా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పుట్టినరోజు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం దొనబండ నుండి ప్రారంభమైన ర్యాలీ భారీ సంఖ్యలో కార్యకర్తలతో ఇబ్రహీంపట్నం చేరుకుంది. కొండపల్లిలో ఐదవ డివిజన్ కౌన్సిలర్ మొగిలి దయ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వసంత కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ ఈ క్రమం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యువకులకు పార్టీ నాయకులకు ప్రజాప్రతినిధులకు పార్టీ శ్రేణులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలియపరిచారు. ఈ సందర్భంగా గొల్లపూడి లోని పార్టీ కార్యాలయంలో పలువురు నేతలు, కార్యకర్తలు వసంతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కలపాల కిరణ్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని, పెద ఆవుటపల్లి గ్రామంలో శనివారం రాత్రి టిడిపి కార్యకర్త కొల్లా బత్తిన చిన్నప్ప ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య ఉపాధ్యక్షులు కిరణ్ కలపాల 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించినారు. కిరణ్ తరుపున ఆయన తండ్రి మల్లికార్జునరావు చిన్నప్ప కుటుంబానికి 5000 రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ సెక్రటరి కుందేటి చంద్రశేఖర్ మరియు తెలుగుదేశం పార్టీ నేత రెబ్బ తంబి మరియు నేతలు పాల్గొన్నారు.

బీజేపీ వద్దు...సెక్యులరిజమే ముద్దు: కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): సీపీఐ గట్టువెనుక పార్టీ కమిటీల సభ్యుల సమావేశం రంగారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14 నుంచి సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో జరుగనున్న పాదయాత్రలను జయప్రదం చేయాలని పిలపునిచ్చారు. ఈ సమావేశంలో పంచదార్ల దుర్గాంబ, ఉప్పలపాటి శివప్రసాద రాజు, బుద్దే రాజ, నాగేశ్వరావు 38, 39, 40, 42, 43, 44, 45 డివిజన్‌ల స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈస్టర్ స్ఫూర్తి - నదీ ఈత పూర్తి



విశాలాంధ్ర-విజయవాడ: ఆదివారం వేకువనే పలువురు పిల్లలు, వారి తల్లిదండ్రులతో కృష్ణానదీ దక్షిణతీరాన అరవింద పాఠశాల విద్యార్థులతో చేరి, వారధి క్రింద జలాలలో "ప్రకృతిలో పిల్లల" కార్యక్రమం ఉల్లాసంగా జరుపుకొన్నారు. వేసవి వేడి వల్ల 2కిమీలకు కుదింప పడ్డ 5కిమీ ఇసుక తిన్నెల పరుగును ఆరంభిస్తూ సీనియర్ సిటిజన్ స్విమ్మర్, మాజీ ఉమ్మడి ఆం"ప్ర" మంత్రి వర్యులు యెర్నేని సీతాదేవి అవార సంకల్పించిన నదీ సంరక్షణ, ఈతశిక్షణ, ప్రాణరక్షణ కార్యక్రమాల నిర్వహణ తీరు పట్ల అవార అంకిత సేవాభావాన్ని ప్రశంసించారు. ఈస్టర్ అభినందనలు తెలిపి, అదే పునరుత్తేజిత స్ఫూర్తితో అవారాలో శిక్షణ పొందిన చిన్నారి స్విమ్మర్స్ తో కలిసి తాను నదీనిడివి ఈదారు. మహిళా శిక్షకురాలు శకుంతలాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆవార వాలంటీర్లు శకుంత్, సందీప్, రాధిక, కిషోర్, లక్ష్మీశ్రీ, శ్రీనివాసరెడ్డి, సాకేత్, చంద్రిక సహకరించారు. ఈ ప్రకృతిలో పిల్లల కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తిగలవారు 9494126812 వాట్సప్‌లో నమోదు చేసుకొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఈస్టర్ పండుగ సందర్భంగా టేనర్ పేట క్రీస్తు యువజన సంఘం అధ్వర్యంలో ఐజాక్ వీధిలో ఈస్టర్ కేక్ కట్ చేసి, మజ్జిగ పంపిణీ చేశారు. మాజీ కార్పరేటర్ డీవీ రమణబాబు మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి జరగాలని క్రీస్తు ప్రభువు సందేశం ఇచ్చారని చెప్పారు. ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్ మైకేల్, అర్ ప్రభుదాస్, నాగోతి రామారావు, డి.బాబు, జక్రయ్య, మల్లెల రాజు, టి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కానూరు వెంకటేశ్వరరావుకి ఘన నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: అరుణోదయ సంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కానూరు వెంకటేశ్వరరావు 8వ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్ ఇఫ్టూ కార్యాలయంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ వలసవాదానికి, స్వదేశీ బూర్జువా వర్గంపై బుర్రకథ, ఒగ్గు కథ, హరికథ మరియు "ప్రగతి బాగోతం" అనే నాటకాన్ని రాసి విస్తృతంగా ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని రగిలించిన కళాతపస్వి కానూరు వెంకటేశ్వరరావుఅనీ, ఆనాటి నక్సల్బరీ, శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు ఆయనను మరింత విప్లవ చైతన్యాన్ని కలిగించాయన్నారు. ఇఫ్టూ నగర అధ్యక్షుడు కె. రవీంద్ర, ప్రగతి శీల ఆటో కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్. కనకరావు, ఇఫ్టూ నగర ఉపాధ్యక్షుడు విఘ్నేష్, ఉమాపతి, పిడిఎస్ యు నాయకులు వేణు, కె. చందన్ తదితరులు పాల్గొన్నారు.

అన్వీ సిస్టమ్స్ నుంచి రివల్యూషనరీ గ్రాఫేన్ టెక్నాలజీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అన్వీ సిస్టమ్స్ తన అధునాతన ఓరా మెమరీ, ఎస్వీఎంఈ స్టోరేజీ పరికరాలను వినూత్న గ్రాఫేన్ టెక్నాలజీని ప్రారంభించింది. ఈ అధునాతన ఉత్పత్తులు అసమానమైన పనితీరు, మెరుగైన సామర్థ్యం, అధిక కాలం మన్నికకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచాయి. ఓరా లైనప్‌లో వ్యక్తిగత వినియోగదారుల నుంచి డేటా సెంటర్‌లు, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్‌ల వరకు విభిన్న వినియోగదారు అవసరాలను తీర్చడానికి వివిధ సామర్థ్యాలు, ఫారమ్ కారకాలు ఉన్నాయి. గ్రాఫేన్ టెక్నాలజీని చేర్చడం ద్వారా అన్వీ సిస్టమ్స్ ఓరా ఉత్పత్తులు సరైన ఉష్ణ నిర్వహణను నిర్ధారిస్తాయి. థర్మల్ థ్రోట్లింగ్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని అన్వీ సిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో ఉదయ్ కిరణ్ కొణతాల తెలిపారు. అన్వీ సిస్టమ్స్ ఓరా మెమరీ, నిల్వ ఉత్పత్తులు ఇప్పుడు అధీకృత రిటైలర్లు, పునఃవిక్రేతదారులు, కంపెనీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

విశాలాంధ్ర-కంచికచర్ల: పట్టణానికి చెందిన వేముల వీరబాబు ఇబ్రహీంపట్నం కూలింగ్ కెనాల్ వద్ద అనుమానాస్పద మృతి చెందాడు. స్థానిక ఎస్సై సుబ్రమణ్యం తెలిపిన వివరాల ప్రకారం కంచికచర్ల పట్టణానికి చెందిన వేముల శ్రీను (మటన్ శ్రీను) చిన్న కుమారుడు వేముల వీరబాబు స్థానిక మిక్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మూడు రోజులు నుంచి కంచికచర్లలో కనిపించడం లేదు. ఈ విషయమై స్థానిక కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసేందుకు వెళ్లగా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ నుంచి అనుమానస్పద మృతి కేసుకు సంబంధించిన వివరాలను, ఫొటోలు చూపించారు. సదరు మృతుని ఫొటోలు వేముల వీర బాబు ఫొటోలకు సరిపోలి ఉన్నాయి. దీంతో మృతుడు వేముల వీరబాబుగా మృతుని బంధువులు నిర్ధారించుకున్నారు. కుటుంబ సభ్యులు ఇబ్రహీంపట్టణం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు తెలుసుకుని విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకున్నారు. చేతికి అంది వచ్చిన తన కుమారుడు మృతిని జీర్ణించుకోలేక అతని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

విశాలాంధ్ర- కంచికచర్ల: మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన బొక్క స్వామి కుమారుడు బొక్కా సంషోన్ (23) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరి వేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

అంకమ్మ ఆలయానికి విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలోని శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయం వెండి తాపడం తయారుచేయు నిమిత్తం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, మల్లారెడ్డి గూడెం మండలం, దొండ పాడు గ్రామానికి చెందిన మాడ్తల కృష్ణయ్య. గురవమ్మ దంపతులు పదివేల పదహారు రూపాయలు ఆలయ ధర్మకర్తలు కోలా రామారావు చేతుల మీదుగా అందజేశారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

భీమవరంలో మా నమ్మకం నువ్వే జగన్

విశాలాంధ్ర-వత్సవాయి: మండలంలోని భీమవరంలో సీఎం జగన్ ఆదేశాల మేరకు, ఏపీ ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచనల మేరకు జగ్గయ్యపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ రన్ హుస్సేన్ సారధ్యంలో గ్రామ ప్రముఖ నాయకులు గుండం రంగారెడ్డి నేతృత్వంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం భీమవరం సెగ్మెంట్-2లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హుసేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వంలో లేనివిధంగా మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని పేర్కొన్నారు. భీమవరం గ్రామంలోని మైనార్టీల ప్రతి గడపను ఆయన తలుపు తట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఎటువంటి అవకాశాలను కల్పిస్తున్నాయి, మైనార్టీల ఐక్యత, ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర సంక్షేమ ఫలాలు ఏ విధంగా అందుతున్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కనివిని ఎరుగని రీతిలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులకే దక్కుతుందని ఆయన అన్నారు. షేక్ ఇమామ్ అలీ, పెద్ద హుస్సేన్, నబి షరీఫ్, అబ్దుల్లా, కో ఆప్షన్ ఎంపీటీసీ ఎస్ డి హుసేన్, నాగుల్, మమ్మదని, వాలంటీర్ భాష, కరీమున్నీసా,మహబూ, లాలు, మస్తాన్, మౌలాలి తదితర మైనార్టీలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

అక్రమ ఆదాయానికి అడ్డాగా మట్టి మాఫియా

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో అధికార పార్టీ నేతలు పలు గ్రామాల్లో తమ అక్రమ ఆదాయానికి అనుమతి లేని మట్టి తవ్వకాలను ఆలంభనగా మార్చుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో గ్రామస్థాయి అధికారపార్టీ నేతల కనుసన్నల్లో ఎటువంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. వీరి కన్ను పడిన కొండలు, గుట్టలు, చివరికి అడవులు సైతం అంతరించే పరిస్థితి తలెత్తుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రమైన విస్సన్నపేటతో సహా పలువురు నేతలు మట్టి తరలించే ట్రాక్టర్ల యజమానుల నుంచి తమ సొంత మనుషులతో నగదు వసూలు చేస్తున్నట్లు వినికిడి. ఇప్పటికే పుట్రేల, విస్సన్నపేట, కొండపర్వ పంచాయతీల్లోని కొన్ని కొండలను ఇష్టానుసారం తవ్వి అధిక ధరలకు విక్రయించుకున్నారు. మరోవైపు చెరువులను ఇష్టానుసారం తవ్వి ఇటుక బట్టీలకు విక్రయించటంతో చెరువుల నీటి పారుదలకు ఇబ్బందులు తలెత్తి సాగురైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తాతకుంట్ల, నరసాపురం పంచాయతీల్లోని అటవీభూముల్లో కొందరు అధికారపార్టీ నేతల అండతో ఇష్టానుసారం తవ్వకాలు జరిపినట్లు ఆయా గ్రామాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకుంటే అధికారపార్టీ నేతల ఆగ్రహానికి గురవుతామనే భయంతో కన్నెత్తి చూడటంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గంపలగూడెంలో ఇంటింటికీ బీజేపీ

విశాలాంధ్ర-గంపలగూడెం: స్థానిక కాపుల వీధిలో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి బీజేపీ నాయకులు వివరించారు. ఇంటింటికీ బీజేపీ, గ్రామగ్రామాన ఓబీసీ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కోశాధికారి చింతల నాగేశ్వరరావు, జిల్లా ప్రచార కార్యదర్శి పిల్లి ఎల్లమందల రావు, పట్టణ శాఖ అధ్యక్షులు కోదుమూరు సూర్య ప్రకాష్ రావు, ఓబీసీ గంపలగూడెం మండల అధ్యక్షులు పగడాల శంకర్, జిల్లా కార్యదర్శి కే. నాగోపాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు నేరెళ్ల యుగంధర్, నాయకులు చిట్యాల హనుమంతరావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ, అన్నదానానికి విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో గుంటూరు జిల్లా గుంటూరు పట్టణము నకు చెందిన యోగానంద శ్రీనివాసరావు అమ్మవారి భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. నిత్య అన్నదాన పథకములకు విరాళముగా రూ.15,232, గోసంరక్షణకు రూ.5వేలు, అంకమ్మ అమ్మవారి ఆలయం వెండి తాపడమునకు రూ.21,116 భక్తుల ద్వారా విరాళముగా వచ్చాయి. ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు, ఆలయ ధర్మకర్తలు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, ఆలయ ఏఈవోలు కొండలరావు, తిరుమలేష్ పాల్గొన్నారు.